



యూబిట్ కాయిన్ దందాలో అరెస్ట్ అయిన ఎక్సైజ్ ఎస్సై, ప్రభుత్వ ఉపాధ్యాయులు (ఫైల్)

యూబిట్ కాయిన్ దందాలో అరెస్ట్ అయిన ప్రభుత్వ ఉపాధ్యాయులు వీరే



యూబిట్ కాయిన్ గుట్టురట్టు



వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ

- మరో ముగ్గురు స్టార్ హోల్డర్ల అరెస్టు
- సూత్రధారులుగా సర్కారు టీచర్లు
- ఇప్పటికే ఐదుగురి అరెస్టు
- వీడిన చైన్‌దందా చిక్కుముడి

నిర్మల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత నెల రోజుల నుంచి తీవ్ర చర్చనీయాంశంగా మారిన యూబిట్ కాయిన్ చైన్‌దందాపై పోలీసులు సీరియస్‌గా ఉక్కుపాదం మోపారు. వేల మంది అమాయకులతో పెట్టుబడులు పెట్టిస్తున్న కొంతమంది టీచర్లు ఇతర ప్రభుత్వ ఉద్యోగులను కొద్దిరోజుల క్రితం ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో అరెస్టు చేసి జైలుకు పంపడంతో ఈ దందా వ్యవహారం అంతటా దుమారం రేపిన సంగతి తెలిసిందే. అయితే ఈ మోసపూరిత దందా కొనసాగడం వెనక చాలా మంది ప్రభుత్వ టీచర్లు, మరి కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పసిగట్టారు. ఈ దందా ద్వారా ప్రతీరోజూ లక్షల రూపాయల్లో లావాదేవీలు సాగుతున్నట్లు కూడా పోలీసులు గుర్తించారు. దీంతో ఎస్పీ ఆధ్వర్యంలో ఓ స్పెషల్ టీం ఏర్పాటు చేశారు. ఈ స్పెషల్ టీం సభ్యులు జిల్లాలోని కడెం, పెంబి, ఖానాపూర్, నిర్మల్ ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి సారించి యూబిట్ కాయిన్ దందాగుట్టును రట్టు చేశారు. మొదట ఓ ఎక్సైజ్ ఎస్ఐతో పాటు ఓ కానిస్టేబుల్, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అలాగే మరో ఇద్దరు గవర్నమెంట్ టీచర్లను అరెస్టు చేసిన పోలీసులు తాజాగా మంగళవారం ముగ్గురు ప్రభుత్వ టీచర్లను ఆదుపులోకి తీసుకొని విచారణ మొదలుపెట్టారు. వీరిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇప్పటి వరకు అరెస్టు అయిన వారందరు మెజార్టీగా గవర్నమెంట్ టీచర్లే కావడంతో జిల్లా అంతటా ఈ వ్యవహారం కలకలానికి కారణమవుతోంది. అయితే పోలీసులు ఈ మొత్తం దందా గుట్టును రట్టు చేస్తూ దశల వారీగా స్టార్ హోల్డర్‌లైన అసలు సూత్రధారులను అరెస్టు చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది.



విదేశీ పర్యటనలో ఓ ఉద్యోగి (ఫైల్)

స్టార్ హోల్డర్‌లలో ఎక్కువగా టీచర్లే

యూబిట్ కాయిన్ దందాలో 10 లక్షల నుంచి 12 లక్షల రూపాయల పెట్టుబడి పెట్టించిన వారికి ఆ యాప్ నుంచి వన్‌స్టార్ గుర్తింపు లభిస్తుంది. అలాగే 25 లక్షల రూపాయల పెట్టుబడి పెట్టించిన వారికి 2 స్టార్, 50 లక్షలు పెట్టించిన వారికి 3 స్టార్, 75 లక్షలు పెట్టిస్తే 4స్టార్, కోటి రూపాయల వరకు పెట్టిస్తే 5 స్టార్ రేటింగ్‌లను ఆ సంస్థ కేటాయిస్తుంది. ఈ రేటింగ్‌ల ఆధారంగా వారి యాప్‌లోని అకౌంట్‌లలో ప్రతీరోజూ కమీషన్ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బులు జమ అవుతున్నట్లు చెబుతున్నారు. కాగా జిల్లాలోని దాదాపు 20 నుంచి 30 మంది వరకు టీచర్లే ఈ స్టార్ రేటింగ్‌లను పొందిన వారిలో ఉన్నట్లు చెబుతున్నారు. వీరంతా తమకున్న పరిచయాలను అడ్డం పెట్టుకొని వేలాదిమందిని ఇందులో సభ్యులుగా చేర్పిస్తూ వారి నుంచి తమకు వచ్చే కమీషన్‌ను నగదు రూపంలో తీసుకుంటున్నారని అంటున్నారు. లక్ష రూపాయల పెట్టుబడి పెట్టిన వారికి ప్రతీనెల 14,850 రూపాయలను కమీషన్‌గా జమ అవుతున్నట్లు చెబుతున్నారు. ఈ లావాదేవీలన్నీ బ్యాంక్ అకౌంట్‌లలో కాకుండా యాప్ అకౌంట్‌లో జమ అవుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

ముగ్గురు టీచర్ల అరెస్టుతో కలకలం

కాగా ఈ యూబిట్ కాయిన్ దందా వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్న ముగ్గురి స్టార్‌హోల్డర్‌లను బుధవారం పోలీసులు అరెస్టు చేసి ఆదుపులోకి తీసుకోవడం ఉపాధ్యాయవర్గాల్లో కలకలం రేపుతోంది. ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎక్కువ మంది టీచర్లే కావడంతో ఈ వ్యవహారం అంతటా హాట్ టాపిక్‌గా మారుతోంది. ఇదిలా ఉండగా కొంతమంది టీచర్లు పెద్దమొత్తంలో ఈ దందా కోసం అమాయకుల నుంచి పెట్టుబడులను సేకరించి స్టార్‌హోల్డర్లుగా మారిపోవడం, స్టార్ రేటింగ్ ప్రకారం వీరందరికీ విదేశాల్లో సమావేశాల పేరిట టూర్ ప్యాకేజీలు ఏర్పాటు చేయడంపై కూడా ప్రస్తుతం చర్చ జరుగుతోంది. వీరంతా నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖకు తప్పుడు సమాచారం ఇచ్చి విదేశాలకు టూర్ రూపంలో వెళ్లారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కూడా విచారణ జరపాలంటూ పలువురు డిమాండ్ చేస్తున్నారు. అలాగే టీచర్ల టూర్ ప్యాకేజీలపై జిల్లా ఎస్పీ జానకీ షర్మిల కూడా రహస్య విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

విచారణ వేగవంతం

- యూబిట్ పథకం వెనుక ప్రధాన కుట్రదారు బ్రిజ్ మోహన్‌సింగ్
- అతనిపై దేశవ్యాప్తంగా పలుచోట్ల కేసులు నమోదయ్యాయి
- యూబిట్‌లో ప్రధానపాత్ర పోషించిన 11 బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశాం
- జిల్లా ఎస్పీ జానకీ షర్మిల వెల్లడి

నిర్మల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత ఆన్‌లైన్ దందా యూబిట్ కాయిన్ కేసులో నిర్మల్ జిల్లా పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా బుధవారం ఈ దందాలో కీలకంగా ఉన్న మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ముగ్గురూ ప్రభుత్వ ఉపాధ్యాయులే కావడం విశేషం. గతంలో అరెస్టయిన ఐదుగురు సైతం ప్రభుత్వ ఉద్యోగులే.. ఈ మోసపూరిత ఆన్‌లైన్ యూబిట్ కాయిన్ దందాకు సంబంధించిన కీలక అంశాలను జిల్లా ఎస్పీ జానకి షర్మిల బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎస్పీ వివరాల ప్రకారం..

జిల్లాలోని ఖానాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాసరి రమేష్, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సోనాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బొమ్మిడి ధనుంజయ్, నిర్మల్ జిల్లాలోని కుబీర్ మండలం డౌజి నాయక్ తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కైరం వెంకటేష్‌గౌడ్‌లు ఈ మోసపూరిత ఆన్‌లైన్ దందాలో సూత్రధారులు. గత కొన్నేళ్లుగా వీరు ఈ దందాలో కీలక పాత్రను పోషించి పలువురు అమాయక ప్రజలతో పెద్ద మొత్తంలో పెట్టుబడులను పెట్టించారు. ఈ యూబిట్ పథకం వెనుక ప్రధాన కుట్రదారు బ్రిజ్ మోహన్‌సింగ్. ఇతనిపై దేశవ్యాప్తంగా పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. ఈ బ్రిజ్‌మోహన్‌సింగ్ అనే వ్యక్తికి మోసపూరిత కార్యకలాపాల చరిత్ర ఉంది. క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల ముసుగులో జనం నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నాడు. అయితే యూబిట్ కాయిన్ దందాలో పెట్టుబడి పెట్టి తాము మోసపోయినట్టు ఇటీవల పలువురి వచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఇందులో భాగంగానే ఈ దందాలో సూత్రధారులుగా వ్యవహరిస్తున్న నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు దాసరి రమేష్, బొమ్మిడి ధనుంజయ్, కైరం వెంకటేష్ గౌడ్‌లను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గత కొద్దిరోజుల క్రితం కూడా ఇదే దందా కొనసాగిస్తున్న ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులను సైతం అరెస్టు చేశారు. యూబిట్ కాయిన్ దందాలో ప్రధాన పాత్ర పోషించిన 11 బ్యాంక్‌ఖాతాలను పోలీసులు స్తంభింపజేశారు.ఈ ప్రక్రియతో పాటు ఆయా ఖాతాదారుల ఆస్తులను గుర్తించే ప్రక్రియ కూడా కొనసాగుతోంది.

ఇప్పుడు అరెస్టయిన వారితో పాటు మరికొంత మంది ప్రపంచ వ్యాప్తంగా నాలుగు వేర్వేరు దేశాలలో కీలక కుట్రదారుల అంతర్జాతీయ రహస్య సమావేశాలను సైతం నిర్వహించారని ఎస్పీ జానకీ షర్మిల వివరించారు. ఈ రహస్య సమావేశాల ద్వారా ఈ మోసపూరిత పథకాన్ని అంతర్జాతీయంగా విస్తరించేందుకు, నెట్వర్క్ బలోపేతం చేసేందుకు వ్యూహాలను రచించారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన రహస్య సమావేశాల తాలూకు వివరాలను సేకరించేందుకు సంబంధిత ఏజెన్సీల ద్వారా విచారణ జరుపుతున్నామన్నారు. యూబిట్ క్రిప్టో కరెన్సీ పథకం ద్వారా పెట్టుబడులు పెట్టిన బాధితులు తమ ముందుకు నిర్భయంగా రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. పెట్టుబడులను రికవరీ చేయించేందుకు పోలీసులకు బాధితులు సహకరించాలన్నారు. పోలీసులే తమ వద్దకు వచ్చేలా చూడకుండా.. బాధితులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులకు స్టేట్మెంట్ ఇవ్వాలని ఆమె కోరారు. ఇలా చేయడం ద్వారా వారు కోల్పోయిన సొమ్మును తిరిగి పొందవచ్చన్నారు. ఈ కేసులో చట్టపరమైన చర్యలతో పాటు ఖచ్చితంగా రికవరీ ప్రక్రియను చట్టపరంగా నిర్వహిస్తామన్నారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు సహకరిస్తున్న ప్రత్యేక టీం అధికారులు ఐపీఎస్ అవినాష్ కుమార్‌తో పాటు ఇన్‌స్పెక్టర్ గోపినాథ్, ఎస్సైలు లింబాద్రి, దేవేందర్, రవి, సాయికృష్ణ, గౌస్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వినతి పత్రాలు స్వీకరించిన డీసీసీ అధ్యక్షులు



సమస్యలు వింటున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 25 : జిల్లాకు చెందిన పలు ప్రాంతాల ప్రజల నుంచి బుధవారం డీసీసీ అధ్యక్షులు కే.శ్రీహరిరావు తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధించిన అధికారుల ద్వారా పరిష్కారం అయ్యేలా చూశారు.

మహిళా కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు చేయాలి



నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 25 : నిర్మల్ పట్టణంతో పాటు మండలాల్లో మహిళా కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి బుధవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావును కోరారు. సభ్యత్వ కార్యక్రమం చేపట్టాలన్నారు. నిర్మల్ పట్టణ అధ్యక్షురాలు వాసవి, సోన్ అధ్యక్షురాలు గీత, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పటిష్టతకు పకడ్బందీ చర్యలు

భైంసా, సెప్టెంబరు 25 : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా పార్టీ పటిష్టతకు పకడ్బందీ విధానాలతో ముందుకు సాగుదామని ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణిలు పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలో మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రతినిధుల బృందం పార్టీ పటిష్టత చర్యలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళా ప్రతినిధులు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ మహిళాభ్యుదయం కోసం ప్రవేశపెట్టిన పథకాలు, చేపట్టిన సంస్కరణలు, సాధించిన విజయాలు ఇంటింటా వివరించాలన్నారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మీ, కాంగ్రెస్ ప్రతినిధులు శంకర్ చంద్రే, గంగారెడ్డి, నియోజక వర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల పార్టీ ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్, జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణిలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం

- కలెక్టర్ అభిలాష అభినవ్
- వయోవృద్ధులకు సన్మానం



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 25 : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అంతర్‌జిల్లా వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బుధవారం నుండి అక్టోబరు 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వృద్ధాశ్రమాల్లో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. తల్లిదండ్రుల పోషణ, ఆరోగ్య సంరక్షణ 2007 చట్టంపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించాలన్నారు. అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు వయోవృద్ధులతో ప్రతిజ్ఞ చేయించారు. వయోవృద్ధులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, సీడీపీవో, ఎంపీ లింగన్న, తదితరులు పాల్గొన్నారు.



వయోవృద్ధులకు సన్మానం

తిరుమల లడ్డు వ్యవహారంలో దోషులను శిక్షించాలి

తిరుపతి శ్రీహరి లడ్డు వ్యవహారంలో దోషులను కఠినంగా శిక్షించాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా అపవిత్ర పదార్థాలతో లడ్డు తయారు చేసి ప్రతిష్ఠను దిగజార్చారన్నారు. పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మేడిసెమ్మె రాజు, రాఘవులు, గుణవంత్ రావు, విలాస్, ప్రవీణ్ శర్మ, సోలాపూర్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితమైన దీన్ దయాళ్

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏలేటి



విలేకరులతో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 25 : భారత సమాజంలో అత్యంత బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి దీన్‌దయాళ్ అని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం దీన్‌దయాళ్ జయంతి వేడుకలను నిర్మల్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో విలువల కోసం తపించిన మహనీయుడన్నారు. నాటి జన సంఘ్ నేటి బీజేపీ నిర్మాణంలో ఆయన కీలకపాత్ర వహించారన్నారు. ఆయన అమరుడైనా ఆయన ఆలోచనలు భారత రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. స్వదేశీ, స్వావలంబన నినాదకర్త అన్నారు. దేశీయ వనరుల, విలువలపై ఆధారపడి ఆర్థిక స్వావలంబన నినాదాన్ని బలపర్చాడన్నారు. దేశ నాగరికత, సాంస్కృతిక విలువలు ప్రస్ఫుటం చేసే జాతీయ వాదాన్ని ప్రోత్సహించారని ఆయన సేవలని కొనియాడారు. జిల్లా కేంద్రంలో దీన్‌దయాళ్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ విగ్రహాల ఏర్పాటుకు శంఖుస్థాపన చేశారు. త్వరలో వాటిని కేంద్ర మంత్రులతో ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి, నాయకులు రాంనాథ్, సత్యనారాయణగౌడ్, అయ్యన్నగారి భూమయ్య, మేడిసెమ్మె రాజు, రాచకొండ సాగర్, ఒడిసెల అర్జున్, నారాయణ గౌడ్, విలాస్, బాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

30న రైతు హామీల సాధన దీక్ష

ఈ నెల 30న రైతులతో కలిసి 24 గంటల పాటు బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద రైతు హామీల దీక్ష చేపడుతున్నట్టు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నిర్మల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 420 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. రుణమాఫీ పూర్తి చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. రుణమాఫీకి 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని చెప్పి ప్రభుత్వం ఇప్పటి వరకు 17 వేల కోట్లు మాత్రమే చేసిందన్నారు. ప్రభుత్వ రుణమాఫీ పూర్తయిందని చెప్పడం మోసం చేయడమే అన్నారు. సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. అన్నదాతలకు అండగా ఉంటామన్నారు. హామీలు అమలయ్యేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. తెలంగాణలో ఎక్కువ మంది రైతులు దొడ్డు వడ్లు పండిస్తారని తెలిపారు. బోనస్ భారం తగ్గించుకునేందుకు సన్నాయి నొక్కులు నొక్కుతోందన్నారు. రైతు భరోసా ఊసేలేదని, రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, పించన్ల పెంపు, జరగలేదన్నారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత, రేషన్ కార్డులు, పేదలకు పక్కా ఇళ్లు తదితర వాటిపై ప్రస్తావనే లేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు నిధులు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో హిందువుల ఆస్తులను టార్గెట్ చేస్తూ కూల్చివేస్తున్నారని, పాత బస్తీకి మాత్రం హైడ్రా బుల్డోజర్లు వెళ్లడం లేదన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం దందా చేస్తోందని ధ్వజమెత్తారు. జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రాంనాథ్, సత్యనారాయణ గౌడ్, వడ్డీ రాజేందర్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



బొంతేవాడ్ నాగేష్(ఫైల్)

తానూర్, సెప్టెంబరు 25 : మండలంలోని నంద్‌గావ్ గ్రామానికి చెందిన బొంతేవాడ్ నాగేష్(49) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతు, మద్యానికి బానిసయ్యాడని, ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లి గ్రామ సమీపంలో గల తన సొంత చేనులో వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సంగీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

మల్లాపూర్‌లో పోషణ్ అభియాన్



మల్లాపూర్‌లో పోషకాహార వారోత్సవాలు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 25 : మండలంలోని మల్లాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పోషకాహార విలువల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు బాపట్ల లలిత, సునీత, ఏఎన్‌ఎం ఉమా, ఆశా కార్యకర్తలు సరిత, తదితరులు పాల్గొన్నారు.

నూతన మండల విద్యాధికారిగా అశోక్ వర్మ

లక్ష్మణచాంద, సెప్టెంబరు 25 : మండల నూతన విద్యాధికారిగా అశోక్ వర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇంచార్జీగా వ్యవహరించిన మధుసూదన్ సారంగాపూర్ మండల పూర్తిస్థాయి విద్యాధికారిగా తిరిగి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అశోక్ వర్మ మాట్లాడుతూ... మండలాన్ని విద్యారంగంలో అగ్రగామిగా నిలపడమే ధ్యేమని వర్మ పేర్కొన్నారు.

సోన్ మండల విద్యాధికారిగా పరమేశ్వర్

నిర్మల్, సెప్టెంబరు 25 : సోన్ మండల విద్యాధికారిగా జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

'శాంతి భద్రతలకు భంగం కానివ్వను'

తానూర్, సెప్టెంబరు 25 : మండలం శాంతిరక్షణకు భంగం కలగనివ్వకుండా చర్యలు తీసుకుంటానని మండల నూతన ఎస్సై రమేష్ అన్నారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం ఎస్సైని తానూర్ మాజీ సర్పంచ్ విఠల్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్ స్వామిలు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్కరు ఐక్యంగా ఉండి పోలీసులకు సహకరించాలన్నారు. శాంతి భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తాఅన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు న్నారు.

108, 102 వాహనాల తనిఖీ

బోథ్, సెప్టెంబరు 25: మండలంలోని 108, 102 వాహనాలను క్వాలిటీ ఆడిటింగ్ డిపార్టుమెంట్ ఆఫీసర్ కిషోర్‌తో పాటు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనా లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ మాట్లాడుతూ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సూచించారు. వాహనాలను గర్భిణులు, బాలింతలు వాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ పైలెట్ స్వామి మహేష్‌కుమార్ 102 ప్రాజెక్టు నుంచి ఉత్తమ పైలెట్లుగా అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ రాజశేఖర్, డాక్టర్ అవినాష్ రోజా రాణి, పైలెట్లు సంతోష్, ప్రశాంత్, రమేష్, నవీన్‌కుమార్, బాబులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బోథ్, సెప్టెంబరు 25: మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన కోట్నాక్ కైలాస్(30) అనే వ్యక్తి ఈనెల 21న ఉదయం ఎడ్లబండిని ఢీకొని తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 21న నాగపూర్ గ్రామం నుంచి బోథ్‌కు వెళ్లి వస్తానని చెప్పి మోటార్ సైకిల్‌పై వెళ్లాడని భార్య కొట్నాక్, అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అయితే మార్గమధ్యంలో దన్నూర్ సమీపంలో ఎడ్ల బండిని బలంగా ఢీకొనడంతో బోథ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రిమ్స్ ఆసుపత్రికి తరలించామన్నారు. 24న రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ వివరించారు. మృతుడికి ఇరువురు కుమారులతో పాటు ఒక కూతురు ఉంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరి వేసుకుని..

బోథ్, సెప్టెంబరు 25: మండల కేంద్రానికి చెందిన సోలంకి రవి(31) అనే యువకుడు అప్పుల బాధ భరించలేక బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి వివరాల ప్రకారం.. రవి గత మూడు సంవత్సరాల క్రితం వ్యాపారం నిమిత్తం వివిధ బ్యాంకుల్లో అప్పులు చేశాడని అయితే అప్పుల భారం తడిసి మోపెడు కావడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక గ్రామ సమీపంలోని ఓ చేనులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. అయితే మృతుడు మంగళవారం సాయంత్రం నుంచి ఇంటి నుంచి వెళ్లాడని ఆయన కోసం ఎక్కడ వెతికినా దొరకలేదని చివరికి బుధవారం ఉదయం గ్రామం సమీపంలోని చేనులో ఉరి వేసుకుని కనిపించడంతో తమకు సమాచారం అందింది అని ఫిర్యాదులో పేర్కొంది. మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విషాదం మిగిల్చిన ప్రేమ జంట ఆత్మహత్య

ఉట్నూర్, సెప్టెంబరు 25: మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాంజీగూడ సమీపంలోని పత్తిచేనులో ఆత్మహత్య ప్రయత్నం చేసిన ప్రేమజంట మరణాలు ఆయా గ్రామాల్లో విషాదాలు నింపాయి. రాంజీగూడకు చెందిన ప్రియుడు ఆత్రం హనుమంతు, మైనర్ బాలిక ప్రేమికులు ఇరువురు సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశారు. ఉట్నూర్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహిస్తుండగా ప్రియుడు హనుమంతు మృతి చెందగా ప్రియురాలు పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తుండగా బుధవారం మృతి చెందింది. ప్రియుడి గ్రామం రాంజీగూడలో, ప్రియురాలు గ్రామం నార్నూర్ మండలం బొడ్డిగూడలో విషాదాలు నెలకొన్నాయి. బాలిక తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఎస్సై తెలిపారు.

వాగులో పడి వృద్ధురాలి మృతి

ఉట్నూర్, సెప్టెంబరు 25: ఉట్నూర్ మండలంలోని శంకర్‌తండాకు చెందిన వృద్ధురాలు పవర్ లచ్చిబాయి(65) గ్రామానికి సమీపంలో ఉన్న వాగులో ప్రమాదవశాత్తు బుధవారం పడి మృతి చెందిందని ఉట్నూర్ పోలీసు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, స్టేషన్ రైటర్ నరేష్‌లు తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు వాగు వద్దకు వెళ్లి శవ పంచనామా నిర్వహించామని తెలిపారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

'లక్ష్యం నెరవేరాలంటే పట్టుదల అవసరం'

ఇచ్చోడ, సెప్టెంబరు 25: అనుకున్న రంగంలో రాణించడాకి ప్రతిభే కాదు.. సాధించాలనే పట్టుదల అవసరమని ఎంపీడీఓ లక్ష్మణ్ అన్నారు. ఇచ్చోడ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకుసాగాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సిద్ధంగా ఉన్నమాని విద్యార్థులు తరగతులకు హాజరై విద్యను అభ్యసించాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. మాజీ సర్పంచి చౌహన్ సునిత, గోల్డన్‌లీఫ్ కరస్పాండెంట్ రాథోడ్ మూనిక, అధ్యాపకులు సరస్వతి, మురళీ, అనిత, మధు, సరితారాణి, దయాకర్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

'విజేతలుగా నిలవడం అభినందనీయం'

ఉట్నూర్, సెప్టెంబరు 25: ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కల్చరల్ ఫెస్ట్ 2024లో విజేతలుగా నిలవడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బు గుప్తా అన్నారు. బుధవారం విజేతలుగా నిలిచిన విద్యార్థులతో సమావేశమయ్యారు. రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్ట్‌లో 5విభిన్న ఈవెంట్‌లలో 5 బహుమతులు పొందారని ఆర్‌సీఓ అనిల్‌కాంబ్లె వివరించారు. అందులో 3 పతకాలు 1వ స్థానంలో, 2వ స్థానం పొందాయి. గిరిజనులలో సామాజిక సమస్యలకు సంబంధించిన రంగస్థలం/నాటకంలో పాల్గొనేవారు 1వ బహుమతిని పొందారన్నారు. నవంబరులో ఒడిస్సాలో జరుగనున్న జాతీయ స్థాయి ఫెస్ట్‌లో పాల్గొనే వారందరిని ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా పీవో పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన

బోథ్, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ వారు మాసం కిరణ్ వర్ధంతి సందర్భంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 300మంది కంటి పరీక్షలు నిర్వహించుకోవడం జరిగిందని మాసం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ పేర్కొన్నారు.

'ఫార్మాసిస్టు చట్టాలు అమలు చేయాలి'

నేరడిగొండ, సెప్టెంబరు 25: ప్రపంచ పార్మాసిస్టు దినోత్సవం సందర్భంగా (ఫార్మాసిస్టు సంక్షేమ సంఘం)ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన రిజిస్టర్ ఫార్మాసిస్టులు ఔషధ నియంత్రణ అధికారి(డీఐ) శ్రీలతని కలిసి ఫార్మాసిస్టు చట్టాలు ఇంప్లిమెంటేషన్ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు డి.కపిల్ కుమార్, జిల్లా ట్రెజరర్ మనోజ్, నేరడిగొండ మండల అధ్యక్షుడు ఇషకోద్దిన్ లు, జిల్లావ్యాప్త ఫార్మాసిస్టులు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘు సభ్యులు

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే యూత్ ఫెస్టివల్

● జడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని ● యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం ● పాల్గొన్న కళాకారులు, విద్యార్థులు



బోనం కుండలతో నృత్యాలు చేస్తున్న యువతులు



నృత్యాలు చేస్తున్న కళాకారులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 25: యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి యువజనోత్సవం ఎంతో ఉపయోగపడుతుందని జడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ కళాశాలలు, పాఠశాల విద్యార్థులతో పాటు కళాకారులు కూడా పాల్గొని ఉత్సాహ పరిచారు. కళాకారుల నృత్యాలను చూస్తూ మిగితా విద్యార్థులు కేరింతలు కొట్టారు. అంతకుముందు ముఖ్య అతిథులను గుస్సాడి నృత్యంతో స్వాగతించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను వారి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. యువతలోని నైపుణ్యాలను వెలికి తీసేలా ప్రతియేటా యూత్ ఫెస్టివల్‌ను నిర్వహించడం జరుగుతుందని జడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని అన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన వారికి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. యువత ఇలాంటి వేదికలను వినియోగించుకుంటు వాటిని ప్రపంచానికి పరిచయం చేయాలన్నారు. పోటీల్లో గెలుపోటములను సహాజమని, ఓటమని పాటంల స్వీకరించి గెలుపు కోసం సన్నద్ధం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, విజయ డెయిరీ డీడీ మదుసూదన్, డీఐఈఓ రవీందర్, న్యాయనిర్ణేతలు కబీర్‌దాస్, సతీష్‌దేశ్‌పాండే, సల్లవిజయబాబు, ప్రతాప్‌సింగ్, జగదీశ్, వజ్రమాల, కవిత, వ్యాఖ్యత మసూద్, తదితరులు పాల్గొన్నారు.

'దీన్ దయాళ్ స్ఫూర్తితో ముందుకు..'

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 25: దీన్‌దయాల్ ఉపాధ్యాయుడి స్ఫూర్తితో ముందుకు సాగుదామని బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు పేర్కొన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాళ్ నాయకత్వం, సేవాభావం, పార్టీ కోసం చేసిన కృషిని కొనియాడారు. వారి అడుగు జాడల్లో ప్రతీఒక్కరు పని చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన రచించిన సిద్ధాంతాలనే ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్ఠత కోసం పాటు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాథోడ్ భీంరావు, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు మరప రాజు, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్, షేకావత్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక, నాయకులు మోరే దిలీప్, మాస్కే రాజవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతి కార్యక్రమం ఘనంఘా నిర్వహించారు.ఈ సందర్భంగా దీన దయాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు కోలిపాక రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేశ్, గిరిజన మోర్చజిల్లా నాయకులు రాథోడ్ శేషరావు, జిల్లా నాయకులు లింగగౌడ్, చంద్రశేఖర్, కాల్వరవి, కైలాస్, మహేందర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

● 'దయాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి'

ఆదిలాబాద్ రూరల్: పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయ సాధన దిశగా ప్రతి బీజేపీ కార్యకర్త పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నేతలు పుష్పాంజలి ఘటించారు. దేశం కోసం పండిత్ దీన్ దయాల్ చేసిన సేవలు మరువలేనివని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలోని కంకర మిషన్ పక్కనే ఉన్న భారీ గుంతలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

క్వారీ.. భారీ గుంతల వద్ద భద్రతేదీ?

● ఇచ్చోడలో క్వారీలను సందర్శించిన మైనింగ్ అధికారులు

ఇచ్చోడ, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి పక్కనే బాబుల్‌డో వద్ద గల ఓ కంకర మిషన్‌కు సంబంధించిన క్వారీని బుధవారం మైనింగ్ డీడీ మధుసూదన్‌రెడ్డి, ఏడీ రవీందర్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వారీ పక్కన గల భారీ గుంతలకు ఎటువంటి భద్రతా చర్యలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీ గుంతల చుట్టూ రక్షణ కంచె ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఇంత పెద్ద గుంతలు ఏర్పడిన చుట్టు ఎలాంటి వలయాన్ని ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలకోసారి గుంతల్లో పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు జరుగుతున్న కంచెలు ఏర్పాటుచేయకపోవడం ఏంటని ఆగ్రహించారు. క్వారీల కోసం తవ్విన గుంతలు లోతుగా ఉండటం చూసి అక్కడ ఎలాంటి భద్రతా చర్యలు కనిపించకపోవడంతో సంబంధిత గుత్తేదారుకు నిబంధనలు పాటించి రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని క్వారీలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన పనులు చేపడితే నోటీసులు అందజేస్తామన్నారు. అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



రిమ్స్ ఎదుట ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ఆక్రమణలను తొలగించిన అధికారులు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 25: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ప్రధాన ద్వారం ఎదుట ఉన్న అక్రమ దుకాణాలను బుధవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. రిమ్స్ ప్రధాన ద్వారానికి ఇరుపక్కల ఉన్న అక్రమంగా వెలసిన దుకాణాలను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో తొలగించారు. వైద్య విద్యార్థుల భద్రతతో పాటు అంబులెన్స్, వాహనాల రాకపోకులకు దుకాణాల వల్ల ఇబ్బందిగా మారడంతో దుకాణాలను తొలగించామన్నారు.

'ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం'

ఉట్నూర్, సెప్టెంబరు 25: తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం, ప్రకృతి వనరులు పరిక్షించాల్సిన బాధ్యత ఉన్నప్పుడే సాధ్యమవుతుందని గిరిజన సంక్షేమ శాఖ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.సంధ్యారాణి అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఉద్యానవన నర్సరీని పరిశీలించిన ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను అందరం ప్రోత్సహించాలని సూచించారు. పురుగు మందులు రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించడం వలన తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉద్యానవన నర్సరీలను పరిశీలించామని తెలిపారు. వీరి వెంట ఐటీడీఏ హెచ్ఓ సుధీర్‌కుమార్, టెక్నికల్ సిబ్బంది హార్షిత రైతులు పాల్గొన్నారు.

'కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి'

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 25: మున్సిపల్ కార్మికులకు ప్రతి నెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దర్శనాల నాగేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామల దేవికి కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ జడ్పీటీసీ

ఆదిలాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ని తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ ప్రతిష్ఠ కోసం కష్టపడి పని చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేయాలని పీసీసీ అధ్యక్షుడు సూచించినట్లు గణేష్‌రెడ్డి తెలిపారు.



పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


దీన్‌దయాళ్ సేవలు అనిర్వచనీయం



భైంసాలో దీన్ దయాళ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ ప్రతినిధులు

భైంసా, సెప్టెంబరు 25 : పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు అనిర్వచనీయమైన సేవలు అందించారని బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ అన్నారు. బుధవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పట్టణ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రతినిధులు నిజాం వేణుగోపాల్, గోపాల్ సూత్రావే, సుష్మారెడ్డి, తాళోడ్ శ్రీనివాస్, అల్లెం దీలిప్‌లు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సంఘ్ భావజాలంతో జాతీయ ఐక్యత కోసం పనిచేసిన మహనీయుడు దీన్‌దయాళ్ అని కొనియాడారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దస్తురాబాద్, సెప్టెంబరు 25 : గర్భిణీ స్త్రీలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని రేవోజీపేట్ గ్రామంలో 25 మంది గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యంపై అవగాహన, రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణీలు ఆహారంగా పాలు, చేపలు, గుడ్లు, ఆకు కూరలు తీసుకోవాలన్నారు. గర్భిణీలు సాధారణ ప్రసవాలకే మొగ్గు చూపాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి శైలేంద్ర కన్నయ్య, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, ఏఎన్ఎం జ్యోతి, స్టాఫ్ నర్స్ వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాల భవనాల నిర్మాణానికి కృషి

● మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా, సెప్టెంబరు 25 : నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో కుల సంఘాల భవనాల నిర్మాణాలకు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా కృషి చేస్తానని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన కుల సంఘాల ప్రతినిధులు భైంసా మండలంలోని దేగాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యేను కలిసి సంబంధిత విషయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ ప్రాధాన్యాతననుసారం కుల సంఘ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరీ చేయిస్తానని వెల్లడించారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రిసీతక్క దృష్టికి భవనాల నిర్మాణ అవశ్యకతను వివరిస్తానని తెలిపారు. ఇందులో మాజీ జడ్పీటీసీ బాశెట్టి రాజన్న, మాజీ ప్రజా ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, తులసీరామ్, శ్రావణ్, లక్ష్మణ్, దొండీబా, అహ్మద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులపై కఠినచర్యలు

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్

దస్తురాబాద్ (కడెం), సెప్టెంబరు 25 : నిబంధనలు అతిక్రమించి చికిత్సలను అందిస్తున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. కడెం మండలంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను బుధవారం ఆయన తన బృందంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రిజిస్ట్రేషన్ చేసుకోకుండా, సరైన అర్హత లేకుండా చికిత్సలు అందిస్తున్న ఆసుపత్రులపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉండే ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని, యాంటీ బయోటిక్స్, సెలైన్ బాటిల్స్ పెట్టరాదని ఆదేశించారు. మెడికల్ లాబరేటరీలను కూడా విధిగా నమోదు చేసుకున్న తర్వాతనే పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహణాధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పనితీరుపై సామాన్యులు సంతృప్తిగా ఉన్నారు

● మున్సిపల్ చైర్మన్ సత్యం ● లబ్ధిదారులకు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రాయితీ పత్రాల అందజేత



లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ రాయితీ పత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్, సెప్టెంబరు 25 : రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై క్షేత్ర స్థాయిలో సామాన్యులు సంతృప్తిగా ఉన్నారని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 1వ, 10వ, 11వ వార్డుల పరిధిలో నిర్వహించిన ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ రాయితీ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అభయహస్తం గుర్తింపు పత్రాలను, ఆయా వార్డుల వారీగా ఈ గుర్తింపు పత్రాలను ప్రతి ఒక్కరికి పంపిణీ చేస్తామన్నారు. ఈ వేరు వేరు కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్ కురుమ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలకు విద్యుత్ మోటార్‌ను అందజేస్తున్న మంగాయి సందీప్‌రావు

జడ్పీహెచ్ఎస్ వానల్‌పాడ్

పాఠశాలకు చేయూత

భైంసా రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని రోజుల నుంచి నీటిసమస్య ఉంది. విద్యార్థులు నీటిసమస్య వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వానల్‌పాడ్ గ్రామ మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి ద్వారా లోకేశ్వరం మండలం బిలోలి గ్రామానికి చెందిన మంగాయి సందీప్‌రావు దృష్టికి తేవడంతో వారు స్పందించి పాఠశాలకు అవసరమైన విద్యుత్ మోటార్, రూ. 11,000ల చేయూత ఇవ్వడం జరిగింది. జడ్పీహెచ్ఎస్ వానల్‌పాడ్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మంగాయి సందీప్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేషస్పందన



తానూర్, సెప్టెంబరు 25 : భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని బీజేపీ మండల అధ్యక్షులు యాతాళం చిన్నారెడ్డి అన్నారు. దిన్‌దయాళ్ జయంతిలో భాగంగా మండలంలోని హిప్నెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని దిన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభ్యత్వ నమోదుకు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు కృషి చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు మరింత వేగం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపకైలాస్, సాయినాథ్‌పటేల్, దొనకంటి ఎల్లప్ప, శ్రీనివాస్, లాలూపటేల్, రామనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర ప్రదర్శన



కుంటాల, సెప్టెంబరు, 25 : మండల కేంద్రం కుంటాల స్థానిక సృజన విద్యానిలయం పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థులకు బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యార్థులను తీసుకెళ్లి కార్యాలయాల్లో జరిగే పనితీరుపై విద్యార్థులకు వివరించారు. 4వ తరగతి పాఠ్యాంశంలో భాగంగా ఏఏ ప్రభుత్వ కార్యాలయాల్లో ఏఏ రకాల సేవలు అందుతాయి అనే అంశంపై బుధవారం స్థానిక ఎంపీడీవో, తపాలశాఖ, పోలీసు స్టేషన్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పించారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రైనీ ఎస్సైలు

ఎస్పీని కలిసిన ట్రైనీ ఎస్సైలు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 25 : జిల్లాకు కేటాయించిన ఏడుగురు ట్రైనీ ఎస్సైలు బుధవారం ఎస్పీ జానకిషర్మిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అంకితభావంతో విధులు నిర్వహించి, అనుభవం సంపాదించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేసి పోలీసు శాఖకు మంచిపేరు తేవాలన్నారు.

కళాశాలకు హాజరు కాని విద్యార్థుల వద్దకు అధ్యాపకులు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రైనీ ఎస్సైలు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 24 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు శాతం పెంచడానికి అధ్యాపకులు ఇంటిబాటలో భాగంగా బుధవారం రోజున నర్సాపూర్(జి), నందన్, రాంపూర్, దర్యాపూర్, లోలం, సిర్గాపూర్, బన్సపల్లి, కంజర్, మాయాపూర్, ముజ్గి, చిట్యాల గ్రామాలకు వెళ్లి విద్యార్థులను వారి తల్లిదండ్రులను కలిసి పిల్లలను కళాశాలకు హాజరు అయ్యే విధంగా చూడాలని సూచించారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతున్నాయని, మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులు కళాశాలకు తప్పనిసరిగా హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపిన వారిపై

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ముథోల్, సెప్టెంబరు 25 : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బుధవారం ముథోల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వారిపై అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవోజీ భూమేష్, తాటివార్ రమేష్, మోహన్ యాదవ్, లక్ష్మీనారాయణ, బి. సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీకి

పాల్పడ్డ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

పెంబి, సెప్టెంబరు 25 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందువులు పవిత్రంగా భావించే లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పెంబి మండలంలోని జనసేన పార్టీ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అందే రాజు, పాకాల ప్రవీణ్, బింగి సతీష్, జోగు నరేందర్, శంకర్, భీమేష్, దీపక్, తదితరులు ఉన్నారు.


ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8, కనిష్ఠం 24.7

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

గురువారం 26 సెప్టెంబరు 2024



'పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత'

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 25: తడి, పొడి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ వాహనాల్లో మాత్రమే వేయాలని సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్ సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ సైన్స్ కళాశాల ఆవరణలో స్వచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాల ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. పట్టణాన్ని స్వచ్ఛతగా ఉంచడానికి ప్రజలు సైతం సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంగీత, తదితరులు పాల్గొన్నారు.



● తలమడుగు మండలంలో పోలీసులు పట్టుకున్న గంజాయి నిలువలు

● పట్టుకున్న గంజాయిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ, పోలీసులు

హద్దులు దాటుతున్న.. మత్తు దందా

- జిల్లాలో సరిహద్దులు దాటిస్తూ.. సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- ఆశ చూపుతూ.. అమాయకులను ఉచ్చులోకి దింపుతున్న స్మగ్లర్లు
- మారుమూల ప్రాంతాల్లో గుట్టుచప్పుడుకాకుండా గంజాయి సాగు
- ఏదైనా ఫిర్యాదు వస్తేనే అధికారుల హడావుడి
- జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతున్న తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్ పోస్టు వద్ద గంజాయి కంటైనర్ పట్టివేత



ఆదిలాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ ముఖ ద్వారమైన జిల్లా మీదుగానే ఉత్తరాది రాష్ట్రాలకు జోరుగా గంజాయిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్మగ్లర్ల ఆగడాలు మితిమీరి పోవడంతో జిల్లాలో క్వింటాళ్ల కొద్ది గంజాయి నిల్వలు పట్టుబడుతున్నాయి. తాజాగా తలమడుగు మండలంలో గంజాయిని తరలిస్తున్న కంటైనర్ పోలీసులకు పట్టుబడడం కలకలం రేపుతోంది. పట్టుబడిన గంజాయి విలువ రూ.2కోట్ల 25లక్షలు ఉంటుందని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా.. మరో 8 మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. గత కొంత కాలం క్రితమే బోథ్, ఇచ్చోడ, తదితర మండలాల్లో గంజాయి పట్టుబడిన దాఖలాలు ఉన్నాయి. జిల్లాలోనే మకాం వేస్తున్న స్మగ్లర్లు.. జిల్లా మీదుగా భారీగా గంజాయిని తరలిస్తున్నారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్నచందంగా మత్తు దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తుంది. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్రతో పాటు మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ.. జిల్లా లోనూ విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. మారుమూల ప్రాంతాల్లో గుట్టుగా సాగు చేస్తున్న గంజాయిని సేకరిస్తూ అదును చూసి సరిహద్దులు దాటిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన గంజాయి ముఠాలు జిల్లాకేంద్రంలోనే మకాం వేస్తూ.. దళారులతో ఒప్పం దాలు చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టుల వద్ద సరైన నిఘా లేక పోవడంతోనే.. అడ్డదారుల్లో అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు గంజాయి స్మగ్లర్లతో చేతులు కలిపి అక్రమ దందాకు పరోక్ష సహకారాన్ని అందిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

గంజాయి ముఠాల సంచారం

జిల్లాలో సంచరిస్తున్న గంజాయి ముఠాలు అమాయకులను ఉచ్చులోకి దింపుతున్నారు. యువత, రైతులే టార్గెట్‌గా స్మగ్లర్లు ఈ దందాను కొనసాగిస్తున్నారు. పట్టుబడుతున్న ప్రతీసారి అమాయకులే కేసుల్లో ఇరికి కటకటాల్లోకి వెళ్తున్నారు. గంజాయి సాగుతో పాటు నిల్వలను సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకుంటున్నారు. ఎవరికి అనుమానం రాకుండా మారుమూల గ్రామాల్లో సంచరిస్తూ యథేచ్ఛగా గంజాయిని తరలిస్తున్నారు. అసలు సూత్రధారులు తప్పించుకోవడంతో అమాయకులు బలవుతున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రముఖ వ్యాపారి తెరవెనుక ఉంటూ.. ఈ దందాను సాగిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో ఆ వ్యాపారికి సంబంధించిన దళారులు పట్టుబడిన దాఖలాలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ వ్యాపారి గంజాయి వ్యాపారంలో ఆరితేరినట్లు చెబుతున్నారు. గంజాయిని తరలిస్తూ పట్టుబడిన వారిని బయటకు తీసుకురావడంలో ఆయన సిద్ధహస్తుడని తెలుస్తుంది. ఒప్పందం ప్రకారం ముందే హామీ ఇస్తున్నట్లు తెలిసింది. గతంలో అమాయక యువకులతో పాటు రైతులు కూడా పట్టుబడిన పరిస్థితులు ఉన్నాయి. అయితే స్మగ్లర్లు మాత్రం తమ చేతికి మట్టి అంటకుండా మత్తు దందాను కొనసాగిస్తున్నారు. ఈ దందాలో లోతుగా దర్యాప్తు జరిపితే అసలు విషయం బయటపడే అవకాశం ఉందంటున్నారు.

రహస్యంగా ఒప్పందాలు

స్మగ్లర్లు రహస్యంగా ఒప్పందాలు చేసుకుంటూ.. గంజాయి సాగును చేసే విధంగా అమాయకులను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటలైన పత్తి, సోయా, మొక్కజొన్న, జొన్న పంటల్లో అంతర్‌పంటగా గంజాయిని సాగు చేస్తున్నట్లు సమాచారం. అడపదడప అధికారుల తనిఖీల్లో పట్టుబడుతున్నా.. మారుమూల రహస్య ప్రాంతాల్లో భారీగా గంజాయి సాగవుతున్నట్లు తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో నిఘా సారిస్తే జిల్లాలో క్వింటాళ్ల కొద్ది గంజాయి సాగు వెలుగుచూసే అవకాశం ఉంది. కొండకోనల మధ్య ఉన్న మారుమూల గ్రామాల్లో యథేచ్ఛగా గంజాయి సాగవుతున్నట్లు సమాచారం. గత రెండు, మూడేళ్లుగా గంజాయిని సాగు చేస్తూ పట్టుబడుతున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపి వేస్తున్నారు. అయినా మత్తు దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడడం లేదు. కొంతమంది గంజాయి సాగును ఉపాధి మార్గంగా మార్చుకొని సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అంతర్ పంటగా సాగైన గంజాయిని అక్రమ మార్గాల గుండా తరలించి విక్రయిస్తున్నారు. కానీ ఏదైనా ఫిర్యాదు వస్తేనే అధికారులు హడావుడి చేస్తూ.. ఆ తర్వాత అసలు సంబంధం లేనట్లుగానే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఉత్తరాది రాష్ట్రాలో డిమాండ్

గంజాయికి ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉండడంతో స్మగ్లర్లు ఎంతకైనా తెగిస్తున్నారు. జిల్లా మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారి గుండా రహస్యంగా అదును చూసి సరిహద్దులు దాటిస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో 44వ జాతీయ రహదారిపై బోరజ్ వద్ద చెక్‌పోస్టు ఉండడంతో తలమడుగు, తాంసి మండలాల మీదుగా మహారాష్ట్రకు తరలిస్తూ.. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తూ.. భారీగా దండుకుంటున్నారు. జిల్లాలో గుట్టు చప్పుడుకాకుండా సాగు చేస్తున్న గంజాయిని సేకరిస్తూ పెద్దమొత్తంలో సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్నారు. అమాయకుల వద్ద కిలో రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు కొనుగోలు చేసి.. డిమాండ్ ఉన్న రాష్ట్రాలలో కిలో రూ.10వేల నుంచి రూ.15వేల వరకు విక్రయిస్తూ.. లక్షల రూపాయలు జేబులో వేసుకుంటున్నారు. మహారాష్ట్రకు అడ్డదారుల్లో తరలిస్తున్నారు. జిల్లా మీదుగానే గంజాయి దందా సాగుతున్నా.. సరిహద్దు చెక్‌పోస్టుల్లో అడ్డుకట్ట పడడం లేదు. ప్రధానంగా సరిహద్దు మండలాలైనా బోథ్, జైనథ్, తలమడుగు, తాంసి, బజార్‌హత్నూర్, బేల, నార్నూర్, గాదిగూడ మండలాల మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ అడ్డదారులపై చాలా చోట్ల తనిఖీ కేంద్రాలు లేకపోవడంతో స్మగ్లర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిత్యం జిల్లాలోకి వచ్చి పోయే వాహనాలను క్షుణంగా తనిఖీలు చేస్తే మరిన్ని అక్రమ దందాల గుట్టురట్టయ్యే అవకాశం ఉందంటున్నారు.

కిరాణాదుకాణాల్లో గంజాయి సిగరేట్ల అమ్మకం

బోథ్: మండల కేంద్రంలో పోలీసులు గంజాయి విక్రయాలపై పకడ్బందీగా దాడులు నిర్వహించి విక్రయదారులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అయినా మండల కేంద్రంలో కొంత మంది వ్యక్తులు తమ తమ ఇళ్లలోని కిరాణా దుకాణాలలో గంజాయితో కూడిన సిగరేట్లు, ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రతీ మంగళవారం మద్యం, తెల్లకళ్లు దుకాణాల సమీపంలో ప్యాకెట్లలో తెచ్చి విక్రయిస్తున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు గుట్టుచప్పుడు కాకుండా యువకులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.



గంజాయితో కూడిన ప్యాకెట్

సంక్షిప్త సమాచారం




పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

పశువులకు టీకాలు వేయించాలి

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 25: రైతులు, పశుపోషకులు ప్రతీఒక్కరు తప్పకుండా సీజన్‌లలోని వ్యాధులను ముందుగానే నివారించేందుకు టీకలను వేయిస్తే ఎటువంటి వ్యాధులు ధరిచేరవని మండల పశు వైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పశువైద్యశాలలో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు తప్పకుండా పశువులకు టీకాలను వేయించాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగానే సీజన్‌లలో వచ్చే వ్యాధులను నివారించేందుకు ఉచితంగానే టీకాలను సరఫరా చేస్తుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బోథ్ ఎంఈవోగా పోశెట్టి



బోథ్, సెప్టెంబరు 25: బోథ్ మండల విద్యాధికారిగా కనుగుట్ట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈదాపు పోశెట్టిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ఎంఈవో బాధ్యతలు నేరడిగొండ ఎంఈవో భూమారెడ్డి నిర్వహించారు.

'మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 25: రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరిగి పోతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు ఆశాలత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సుందరయ్య భవనంలో సంఘం జిల్లా 4వ మహాసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల రక్షణపై ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించక పోవడం దారుణమని అన్నారు. మహిళల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సంఘం జెండాను ఆవిష్కరించి మహా సభలను ప్రారంభించారు. ఇందులో సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రాథమిక సహకార సంఘ సమావేశం

నేరడిగొండ, సెప్టెంబరు 25: ప్రాథమిక సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం ఈనెల 27న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు సాబ్లె కిషోర్‌సింగ్ అన్నారు. ఉదయం 12గంటలకు పీఏసీఎస్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న సమావేశానికి ప్రాథమిక సహకార సంఘం సభ్యులు రైతులు హాజరై విజయవంతం చేయాలన్నారు. రైతులు తమ తమ సలహాలు సూచనలు తెలపాలని కోరారు.

లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద..

900 కిలోల గంజాయి పట్టివేత

● 292 ప్యాకెట్లలో రూ.2.25 కోట్ల విలువ గల గంజాయి ● 8 మందిపై కేసు నమోదు, ఇద్దరి అరెస్టు ● గంజాయి కంటైనర్‌తో పాటు రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం ● వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



● పట్టుకున్న గంజాయితో పాటు నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తలమడుగు, సెప్టెంబరు 25: జిల్లా పోలీసు శాఖ చాకచక్య తీరుతో దాదాపు 900 కిలోల గంజాయిని తలమడుగు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దీనిలో భాగంగా నిందితుల్లో అశీష్, మల్కాన్‌గిరి ఒడిస్సా రాష్ట్రం, ముఖ్యమైన సప్లయర్(పరారీ), పండిత్ కసంపూర్ మీరట్, ఉత్తరప్రదేశ్(పరారీ), వసీం అన్సారి, ఉత్తరప్రదేశ్ కంటైనర్ లారీ డ్రైవర్ (అరెస్టు), అర్మాన్, ఉత్తరప్రదేశ్ కంటైనర్ లారీ క్లీనర్ (అరెస్టు), అలాగే గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బుల్దాన, దూలే జిల్లా, మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు(పరారీ), అన్ను జైన్ (పరారీ), ఉత్తరాఖండ్‌కు చెందిన సోను అన్సారి(పరారీ) ఉన్నారని ఎస్పీ పేర్కొన్నారు.

● **కేసు వివరాలిలా..**

ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి పెద్దఎత్తున గంజాయి దేశంలోని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ వివరాలను వెల్లడించారు. పెద్దఎత్తున గంజాయి తరలుతోందన్న పక్క సమాచారంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఐచర్ కంటైనర్ (యూకే08సీబీ5318) ఆదిలాబాద్ పట్టణం వైపు నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తుండగా చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా.. అందులో డ్రైవర్, క్లీనరు ఉన్నారు. దీంతో వారిని ప్రశ్నించగా.. డ్రైవర్ పేరు వసీమ్, క్లీనర్ అర్మాన్ అని తెలిపారు. ఆ తర్వాత పోలీసులు డ్రైవర్‌ను వసీమ్ విచారించగా.. 'ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అన్ను జైన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్, జి.సోను అన్సారి అంతా కలిసి మూడేళ్లుగా గంజాయి వ్యాపారం చేస్తున్నాం. అయితే, గత సంవత్సరం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్, సుక్మా, జగదల్‌పూర్ జిల్లాల అటవీ ప్రాంతం నుంచి చాలాసార్లు తన వాహనంలో గంజాయిని తీసుకువచ్చి సదరు ముగ్గురికి అందజేశారు. ఇలా గంజాయిని తెచ్చి వారికి ఇచ్చినందున వారు తనకు పెద్దఎత్తున డబ్బులు ఇచ్చే వారు. ఇలా దానిని ఇతరులకు అమ్మడం సాధారణంగా జరుగుతోందని' అని తెలిపాడు. అంతేకాకుండా వసీం తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల క్రితం పండిత్‌జీ అతనికి పరిచయమైన ఆశిష్, మల్కాన్‌గిరి ఒడిస్సా అతనితో మాట్లాడి తనకు చెప్పారని, ఆంధ్ర-ఒడిస్సా సరిహద్దు అటవీ ప్రాంతంలో 900 కిలోల గంజాయి ఉందని, మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాకు చెందిన ఒక పార్టీకి గంజాయి అవసరం ఉంది అని పేర్కొన్నాడు. కాగా, రూ.1,50,000 ఇస్తామనగా.. వసీం ఒప్పుకుని క్లీనర్ అర్మాన్‌కు కూడా విషయం చెప్పి తన ఐచర్ వాహనంలో తనతో పాటు అర్మాన్, అశిష్, పండిత్‌జీలతో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడి భద్రాచలం మారేడుపల్లి, చింతూరు ద్వారా అశిష్ చెప్పిన అటవీ ప్రాంతం ఆంధ్ర-ఒడిషా సరిహద్దుకు వెళ్లారు. అక్కడ అశిష్‌కు కలిసి వారి మనుషులతో గంజాయి నింపిన ప్యాకెట్లు గల 36 బ్యాగులను వసీంకు చూపించి కంటైనర్‌లో నింపారు. కాగా, అశిష్ చెప్పిన కంటైనర్ వాహనం ముందు పైలెట్ వాహనంగా గంజాయి ఇవ్వాల్సిన పార్టీకి చెందిన ఒక వ్యక్తి కారులో ముందు ఉంటాడు అని వివరించాడు. అయితే, వసీం గంజాయి నింపుకుని వరంగల్, కరీంనగర్ మీదుగా పైలెట్ వాహనం వాహనం వచ్చిన రూట్‌లో వస్తూ మహారాష్ట్రలోని బుల్దానాకు వెళుతున్నప్పుడు స్థానికంగా పోలీసులు వారిని పట్టుకున్నట్లు ఎస్పీ వివరించారు. కాగా ఇందులో మొత్తం 292 ప్యాకెట్లు ఉన్నాయని, 900 కిలోల వరకు గంజాయి ఉందని, మార్కెట్‌లో కిలో దాదాపు రూ.25 వేలకు అమ్మ వచ్చని తెలిపారు. వీటి విలువ రూ.2 కోట్ల 25 లక్షల వరకు ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.రు.

● **మిగితా ముఠా సభ్యులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు**

గంజాయిని పెద్దమొత్తంలో వాణిజ్యానికి తరలిస్తూ విక్రయిస్తూ కొంటున్న మిగిలిన అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకునేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించి అరెస్టు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ, డీఎస్పీ బి సురేందర్‌రెడ్డిలను, అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఆదిలాబాద్ రూరల్ సీఐ కె.ఫణీధర్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ ఎస్సైలు అంజమ్మ, ముజాహిద్, విష్ణువర్ధన్, సీసీఎస్ రూరల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



ఫింగర్ ప్రింట్ పరిశోధనను పరిశీలిస్తున్న ఎస్పీ

నైపుణ్యాభివృద్ధికి డ్యూటీ మీట్‌ల నిర్వహణ

● జిల్లాస్థాయి మీట్‌ను ప్రారంభించిన ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్, సెప్టెంబరు 25: పోలీసు అధికారులు, సిబ్బంది పనితనాన్ని మెరుగు పరిచేందుకు, పెంపొందించేందుకు గానూ జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీసు డ్యూటీ మీట్‌లను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ డ్యూటీ మీట్‌లో ముఖ్యంగా నేర పరిశోధన, నేరస్థల పరిశోధన, వీఐపీ మూమెంట్, యాంటీ సబటేజ్‌చెక్, డాగ్‌స్క్వాడ్ పనితనం,ఫింగర్‌ప్రింట్‌పై పరిశోధన, బాంబు డిస్పోజల్ టీం విధులు, కంప్యూటర్‌పై నైపుణ్యం, నేరస్థలంలో ఫొటోగ్రఫీ, అవాంఛనీయ సంఘటనలు సంభవించినప్పుడు వీడియోగ్రఫీ చేయు విధానం లాంటి అంశాలలో రాత పరీక్ష, మౌఖి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి జిల్లాస్థాయిలో నగదు రివార్డులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పరీక్షలు కొన్ని అంశాలు ఇన్స్‌పెక్టర్, సబ్ ఇన్స్‌పెక్టర్ స్థాయి వారికి, మరికొన్ని అంశాలు ఏఎస్సై నుంచి కానిస్టేబుల్ వరకు జరుగుతాయని వివరించారు. ఇందులో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేంద్రరావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, బి సురేందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లు, రిజర్వేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **ప్రతీఒక్క ఆయుధంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి**

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో బుధవారం ఫైరింగ్ రేంజ్‌లో శిక్షణ కానిస్టేబుల్‌లకు ఆయుధాలపై పూర్తి పరిజ్ఞానం అందించాలని ఎస్పీ గౌస్‌ఆలం స్వయంగా కార్యక్రమంలో పాల్గొని ఫైరింగ్‌లో మెళకువలు, ఫైరింగ్ చేయు విధానాలపై సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు, అల్లరిమూకలపై వివిధ సందర్భాలలో పోలీసు సిబ్బంది చేయు విధులు, టీయర్ గ్యాస్, స్టన్ గ్రానైట్, వజ్రా వాహనం, గ్యాస్ గ్రానైట్ ప్రయోగం లాంటి అంశాలను శిక్షణ కానిస్టేబుల్‌లకు వివరింగా వివరించారు. అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్ జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, పోలీసు శిక్షణ కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గమ్యం యాప్‌ను వినియోగించుకోవాలి

● ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో డీఎం కల్పన

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 25: ఆర్టీసీ గమ్యం యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో డీఎం కల్పన అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆర్టీసీ ఆధ్వర్యంలో గమ్యం యాప్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రజా రవాణాను మరింత సౌకర్యంగా మార్చేందుకు గమ్యం యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను ఇంటి వద్ద నుంచే వినియోగించుకునేందుకు గమ్యం యాప్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. స్మార్ట్ మొబైల్ ఉన్న ప్రతిఒక్కరూ ఈ గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది విలేజ్ బస్ ఆఫీసర్ సి.సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎం.డి జహీర్, నాయకులు సూర వెంకటి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో డీఎం కల్పన

● **నేడు డయల్ యువర్ డీఎం**

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఈ నెల 26న ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం ఫోన్ నెం. 9959226002 ద్వారా సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.